సాక్షి జగిత్యాల
ఆదివారం । 7 । మే । 2023



జైలులో న్యాయ విజ్ఞాన సదస్సు

జగిత్యాలరూరల్: స్పెషల్ సబ్ జైలులో శనివారం జిల్లా న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు.



'నీట్'కు పటిష్ట భద్రత

జగిత్యాలక్రైం: ఆదివారం జరిగే నీట్ పరీక్షకు గట్టి భద్రత ఏర్పాట్లు చేశామని ఎస్పీ డీఎస్పీ రవీందర్‌కుమార్ శనివారం తెలిపారు.

గరిష్టం/కనిష్టం
34.0/26.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగలు ఎండగా ఉంటుంది. చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నృసింహుని రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

కథలాపూర్(వేములవాడ): దుంపేటలో శనివారం శ్రీలక్ష్మీనృసింహస్వామి రథోత్సవం కన్నులపండువగా జరిగింది. వేకువజామున స్వామివారు ప్రత్యేక పూజలు అందుకొని రథంపై ఆశీనులయ్యారు. ప్రధానవీధుల గుండా రథోత్సవం నిర్వహించగా.. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికి పూజలు చేశారు. సర్పంచ్ అంబటి లత, ఎంపీటీసీ మల్యాల రమేశ్, ఉపసర్పంచ్ జెల్ల ఉమ, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

వేగంగా అభివృద్ధి పనులు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మకరంద్

ధర్మపురి: పట్టణంలో చేపట్టిన అభివృద్ధి పనులు పకడ్బందీగా ఉండాలని అడిషనల్ కలెక్టర్ మకరంద్ ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయంలో శనివారం వివిధ అభివృద్ధి పనుల ప్రగతిపై సమీక్షించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ అధ్యక్షత వహించారు. అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ, పట్టణ అభివృద్ధి కోసం చేపట్టిన హరితహారం, వెజ్ నాన్‌వెజ్ మార్కెట్లు, వైకుంఠధామం, స్వచ్ఛ సర్వేక్షణ్ ప్రక్రియ, దోబీఘాట్ల నిర్మాణం, పారిశుద్ధ్యం నిర్వహణ, వీధి దీపాల ఏర్పాటు తదితర అంశాలపై సమీక్షించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఇందారపు రామయ్య, కమిషనర్ రమేశ్, కౌన్సిలర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గడువులోగా సీఎమ్మార్ చెల్లించాలి

జగిత్యాల: ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా సీఎమ్మార్ చెల్లించాలని అదనపు కలెక్టర్ లత రైస్ మిల్లర్లకు సూచించారు. తన కార్యాలయంలో శనివారం ఆమె అధికారులతో సమావేశం నిర్వహించారు. యాసంగి 2021–22కు గాను 80 శాతం సీఎమ్మార్ చెల్లించారని, మిగతాది గడువులోగా చెల్లించాల్సి ఉందన్నారు. ఈ విషయంలో రోజువారీగా మిల్లులను తనిఖీ చేస్తూ సీఎమ్మార్ నివేదికలు తనకు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సండే స్పెషల్

గురుశిష్యుల కరదీపిక!

- ఎస్సీఈఆర్టీ తెలంగాణ వెబ్‌సైట్‌లో పాఠ్యపుస్తకాలు
- 1 నుంచి 10వ తరగతి వరకు ఇ- పుస్తకాలు
- ఏ సిలబస్ కావాలన్నా.. క్షణాల్లో డౌన్‌లోడ్
- ఎప్పటికప్పుడు విద్యా సమాచారం అప్‌డేట్
- అందుబాటులో శతక పద్యాల ఆడియో పుస్తకాలు
- ఉపాధ్యాయులు.. విద్యార్థులకు సమస్త సమాచారం

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: చినిగిన చొక్కా అయినా తొడుక్కో.. మంచి పుస్తకం కొనుక్కో అన్నారు పెద్దలు. ఎందుకంటే పుస్తకం జీవిత ముఖచిత్రాన్ని మారుస్తుంది. విజ్ఞానాన్ని పంచడమే కాదు, జీవితంలో వెలుగు నింపి, పదిమంది జీవితాల్లోనూ వెలుగులు నింపేలా చేయగల ఏకైక సాధనం. అందుకే, ఎన్నో కష్టాలు పడి, వ్యయప్రయాసలకు ఓర్చి తమ పిల్లల కోసం పాఠ్యపుస్తకాలు సంపాదిస్తారు తల్లిదండ్రులు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు కాస్త అటూ ఇటుగా అయినా.. ప్రభుత్వం పాఠ్యపుస్తకాలు ఉచితంగా సరఫరా చేస్తుంది. కానీ, ప్రైవేటు స్కూళ్లలో చదువుకునే విద్యార్థులకు పుస్తకాలు దొరకడం కొన్నిసార్లు కష్టమవుతుంది. పేద విద్యార్థులైతే సెకండ్‌హ్యాండ్‌లో అయినా సరే.. ఎంతోకొంత చెల్లించి చదువుకుంటారు. ప్రతీ విద్యార్థి ఎంతో విలువైన పాఠ్యపుస్తకాలే తన విజ్ఞానసంపత్తిగా పూజిస్తాడు. ఒక్క విద్యార్థులకే కాదు, వివిధ సబ్జెక్టులు బోధించే ఉపాధ్యాయులకు సైతం ఓ వెబ్‌సైట్ ఒక ఆన్‌లైన్ లైబ్రరీలా మారింది. అలాంటి విజ్ఞాన భాండాగారాలు ఆన్‌లైన్‌లో ఉచితంగా లభ్యమయ్యే వెబ్‌సైట్ గురించి సండే స్పెషల్...



సైబర్ సేఫ్టీ జాగ్రత్తలు




రోడ్డు భద్రత పాఠాలు



పదోతరగతి తెలుగు పీడీఎఫ్



సుమతి శతకం ఆడియోఫైల్ ముఖచిత్రం





ఎస్సీఈఆర్టీ వెబ్‌సైట్‌లో

కాలంతోపాటు పుస్తకం ముఖచిత్రం, దాని తీరుతెన్నులూ మారాయి. ఒకప్పటిలా చేతిలో పట్టుకుని చదివేసేనే పుస్తకం కాదు, సెల్‌ఫోన్, ట్యాబ్, కంప్యూటర్ ఇలా ఎక్కడైనా, ఎప్పుడైనా చదువుకునేలా పాఠ్యపుస్తకాలు పీడీఎఫ్ ఫార్మాట్‌లోకి వచ్చేశాయి. అలా అని వీటికి ఎలాంటి రుసుము చెల్లించనక్కర్లేదు. ఎవరైనా ఉచితంగా చదువుకునేలా ఏర్పాటు చేశారు. https://scert.telangana.gov.in/(హెచ్‌టీటీపీఎస్://ఎస్సీఈఆర్టీ. టీఈఎల్ఏఎన్‌జీఏఎన్ఏ.జీవోవీ.ఐఎన్/ను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల కోసం రూపొందించింది. వెబ్‌సైట్‌లో ఇ–టెక్ట్స్ బుక్ కాలంలో వెళ్లగానే 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూలతో పాటు గణితం, సైన్స్, సోషల్ పాఠ్యపుస్తకాలను పీడీఎఫ్ రూపంలో అందుబాటులో ఉంచింది. వీటిని ఎప్పుడైనా, ఎలాగైనా చదువుకోవచ్చు. కేవలం చదువుకోవడమే కాదు, కావాల్సిన పుస్తకం అందులో ఎంచుకున్న పాఠ్యాంశాన్ని పీడీఎఫ్ రూపంలోనూ డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

- సాధారణంగా ఈ వెబ్‌సైట్ విద్యార్థులకే కాదు, ఉపాధ్యాయులకు సైతం ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలలో బోధించే టీచర్లంతా చాలా దూరం నుంచి స్కూళ్లకు వస్తుంటారు. అలాంటి వారంతా మార్గమధ్యంలో తమ సెల్‌ఫోన్లలోనే ఈ వెబ్‌సైట్ ఓపెన్‌చేసి చెప్పాల్సిన సిలబస్‌ను ప్రిపేరవ్వడం, సాధన చేయడం, సమీక్షించుకోవడం వంటివి చేసుకునే వెసులుబాటు కలిగింది. ప్రయాణాల్లో ఉన్న విద్యార్థులు సైతం ఈ వెబ్‌సైట్ ఓపెన్ చేసుకుని పరీక్షలకు సిద్ధం కావొచ్చు.
- అకడమిక్ క్యాలెండర్‌పైనా ఇక్కడ సమస్త సమాచారం ఉంది. సిలబస్‌తోపాటు పిల్లల పరీక్షల మూల్యాంకనం, పరీక్ష ప్రమాణాలు, రిజిష్టరు నిర్వహణ తదితర విషయాల్లో వృత్తిరీత్యా ఉపాధ్యాయులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. వీటితోపాటు ట్రెయినింగ్స్, టీచర్ ఎడ్యుకేషన్, టీసాట్ ప్రోగ్రాముల ప్రసారవేళలు, విద్యాశాఖ నిర్వహించే పలు రకాల కార్యక్రమాలు, అవార్డులు, సైన్స్ ప్రోగ్రాములు.. ఇలా అనేక రకాల ఉపయుక్తమైన సమాచారం టీచర్లకు అందజేస్తోంది.

శతక పద్యాల ఆడియో..!

ఇ–టెక్ట్స్ బుక్ కాలంపైన శతక పద్యాల ఆడియో కాలం ఉంటుంది. దీన్ని ఎంచుకుంటే తెలుగులో ప్రముఖ కవులు రాసిన సుమతీ, వేమన, భాస్కర, కుమార, దాశరథీ, నరసింహ, శ్రీకాళ హస్తీశ్వర శతకాలు అందుబాటులో ఉన్నాయి. ఈ శతక పద్యాలన్నీ పీడీఎఫ్ రూపంలో అందమైన పత్ర విన్యాసంతో ఆకర్షణీయంగా పీడీఎఫ్ పేజీల్లో తీర్చిదిద్దారు. ఈ పద్యాలు కేవలం చదువుకోవడానికే కాదు, ఈపద్యాలను వినే సదుపాయం కూడా ఉంది. పేజీల అగ్రభాగంలో ఆడియోఫైల్ చిహ్నం ఉంటుంది. దాన్ని ప్లే చేస్తే.. పద్యం గానం చేసి, దాని తాత్పర్యం ఉన్న ఆడియో ఫైల్ వినిపిస్తుంది. పిల్లలతోపాటు, సమస్త ప్రజలను సన్మార్గంలో నడిపే ఈ శతక పద్యాలను డిజిటల్ రూపంలో పొందుపరిచిన విధానంపై ఉపాధ్యాయులు, విద్యార్థులు, తెలుగుపండితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జగిత్యాల జిల్లాకు ప్రాధాన్యం

జగిత్యాల జిల్లాకు చెందిన బద్దెన కవి రచించిన సుమతీ శతకంలోని ఎంపిక చేసిన పద్యాలు ఈ ఆడియో ఫైల్స్‌లో చోటు దక్కించుకున్నాయి. అదే జిల్లా నుంచి కటుకోజ్వల మనోహరాచారి నేతృత్వంలో నేరెళ్ల శ్రీరామకృష్ణాశాస్త్రి సంగీతం అందించారు. ఇందులో కటుకోజ్వల మనోహరాచారి, నేరెళ్ల శ్రీరామకృష్ణాశాస్త్రితోపాటు మాధవి ఈ పద్యాలను గానం చేశారు.

కెరీర్ గైడెన్స్ కూడా

- 10వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఏ కోర్సు ఎంచుకోవాలో వివరిస్తూ కెరీర్ గైడెన్స్ సంబంధించిన సమాచారం అందుబాటులో ఉంచింది.
- సీబీఎస్ఈ ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులకు వివిధ ఇంజినీరింగ్ కోర్సులు, కెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, మెడికల్, కామర్స్, హిస్టరీ.. ఇలా అన్ని రంగాల్లో అగ్ర కోర్సులు, వాటి ప్రాధాన్యాన్ని పరిచయం చేస్తుంది.
- **రోడ్డు భద్రత:** ఇందులో రోడ్డు భద్రతపై 1–10వ తరగతుల వరకు రోడ్డు భద్రత విద్య- ట్రాఫిక్ నిబంధనలు, జాగ్రత్తలపై పాఠాలు ఉన్నాయి.
- **సైబర్ సేఫ్టీ:** విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఏం చేయాలి? ఏం చేయకూడదో వివరించే జాగ్రత్తలను చిత్రరూపకంగా వివరించింది.
- **వ్యక్తిగత భద్రత:** పోలీసుశాఖ సహాయంతో ఆపదల్లో ఎలా వ్యవహరించాలి. ఇంట్లో, లిఫ్టుల్లో, నీటి వద్ద, అగ్నిప్రమాదాలు, వాహనాల వినియోగంపై పూర్తి అవగాహన కలగజేస్తుంది.
- ప్రపంచ తెలుగు మహాసభల వివరాలు, అందులో ప్రదర్శించిన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. బోధనలో టీచర్లకు ఉపయుక్తంగా ఉండేలా బీఈడీ పుస్తకాలు మొత్తం పీడీఎఫ్ ఫార్మాట్‌లో పెట్టారు.

సీఎం సూచనలతో..

సీఎం కేసీఆర్ సూచనల మేరకు విద్యాశాఖ మంత్రి సబిత సారథ్యంలో, విద్యాశాఖ ప్రత్యేక కార్యదర్శి చిత్రా రామచంద్రన్ సూచనల మేరకు తెలంగాణ రాష్ట్ర విద్యాపరిశోధన శిక్షణ సంస్థ సంచాలకులు శేషుకుమారి ఆధ్వర్యంలో ఈ ఆడియోఫైల్స్ రూపొందించారు. వీటిని జిల్లాల నుంచి ఎంపిక చేసిన ప్రముఖ పండితుల చేత పాడించడం గమనార్హం.

అమరుడైన భర్తకు భార్య సెల్యూట్

- తండ్రి చితికి నిప్పు పెట్టిన పెద్దకుమారుడు
- జనసందోహంతో కిక్కిరిసిన మల్కాపూర్
- నివాళులర్పించిన ప్రజాప్రతినిధులు

సైనికా.. సెలవిక..

అనిల్‌ను చివరిసారి చూసేందుకు భారీగా తరలివచ్చిన గ్రామస్తులు





సైనికుల గౌరవ వందనం



అనిల్ పార్థివదేహం వద్ద నివాళి అర్పిస్తున్న మంత్రి గంగుల

బోయినపల్లి(చొప్పదండి): జమ్మూకశ్మీర్‌లో జరిగిన ప్రమాదంలో చనిపోయిన అనిల్ అంతిమయాత్ర కుటుంబ సభ్యుల రోదనలు, బంధువులు, ప్రజాప్రతినిధుల అశ్రునయనాల మధ్య ముగిసింది. శనివారం ఉదయం అనిల్ భౌతికకాయం ఆయన స్వగ్రామమైన మల్కాపూర్‌లోని ఇంటికి చేరడంతో మండలవ్యాప్తంగా జనం భారీగా తరలివచ్చారు. ఆయన మృతదేహం హైదరాబాద్ నుంచి గంగాధరకు చేరుకుంది. అక్కడ పలువురు యువకులు జాతీయ జెండాలతో స్వాగతం పలికి ర్యాలీగా మల్కాపూర్ గ్రామానికి తీసుకెళ్లారు. అక్కడ ఆర్మీ అధికారులు సైనిక లాంఛనాలతో గౌరవ వందనం చేశారు. అనంతరం అంతిమయాత్ర ప్రారంభించారు. అనిల్ వ్యవసాయ భూమిలో అంత్యక్రియలు నిర్వహించారు. ఆర్మీ సిబ్బంది గౌరవ వందనం చేసి గాల్లోకి కాల్పులు జరిపారు. అనిల్ పెద్ద కుమారుడు అయాన్ తండ్రి చితికి నిప్పంటించాడు.

నిన్ను విడిచి ఎలా ఉండాలే బావా..

అనిల్ భార్య సౌజన్య రెండురోజులుగా కన్నీరుమున్నీరుగా విలపిస్తూనే ఉంది. 'బావా నిన్ను విడిచి నేనెలా ఉండాలే బావా.. పిల్లలను ఎట్ల సాదాలే బావా'.. అని రోదించడం చూసేవారిని కంటతడి పెట్టించింది. 'నన్ను పోలీస్‌గా చూడాలని అంటివి. నీ మాటతోనే ఎస్సై పరీక్ష రాసిన బావ..' రెండు నెలలైతే దగ్గరికి బదిలీ చేయించుకుంట అంటివి.. అంతలోనే ఘోరం జరిగిందా బావా..' అంటూ భర్త ఫొటో ఉన్న ఫ్లెక్సీ వద్ద విలపించింది. అనిల్ తల్లి లక్ష్మి, అనారోగ్యంతో ఉన్న తండ్రి మల్లయ్య ఏడుస్తుండడాన్ని ఆపడం ఎవరితరమూ కాలేదు. కుమారులు అయాన్, అరయ్ సైతం తండ్రి శవపేటిక వద్ద విలపించారు.

అమరుడైన భర్తకు భార్య సెల్యూట్

అనిల్ భౌతికకాయాన్ని చితిపై పెట్టిన అనంతరం సైనికులు గౌరవ వందనం చేశారు. సైనిక గీతం ఆలపించిన సమయంలో అంతులేని దుఃఖంలోనూ సౌజన్య భర్త భౌతికకాయానికి సెల్యూట్ చేయడం అక్కడున్నవారిని మరింత కంటతడి పెట్టించింది. తండ్రి చితికి ఆయన పెద్ద కుమారుడు అయాన్ నిప్పు పెట్టాడు. అనిల్ సైనిక యూనిఫాంను ఆర్మీ అధికారులు సౌజన్యకు అందించారు.

హాజరైన మంత్రి గంగుల, ఎంపీ సంజయ్

అనిల్‌కు మంత్రి గంగుల కమలాకర్, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్, ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, కలెక్టర్ అనురాగ్‌జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్, ఏఎస్పీ తదితరులు నివాళులు అర్పించారు. అంత్యక్రియలు ముగిసేవరకూ అక్కడే ఉన్నారు. చొప్పదండి ఎమ్మెల్యే రవిశంకర్ అనిల్ పాడె మోశారు. అంతిమయాత్రలో అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, వేములవాడ ఆర్డీవో పవన్‌కుమార్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు జోగినిపల్లి రవీందర్‌రావు, ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, జెడ్పీటీసీలు కత్తెరపాక ఉమ, నాగం కుమార్, సెస్ డైరెక్టర్ కొట్టిపెల్లి సుధాకర్, సర్పంచు కోరెపు నరేశ్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య, సెస్ మాజీ చైర్మన్ అల్లాడి రమేశ్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం, ఎంపీడీఓ నల్లా రాజేందర్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు. ఏఎస్పీ చంద్రయ్య, వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి, బోయినపల్లి ఎస్సై మహేందర్ బందోబస్తు నిర్వహించారు.



అనిల్ సైనిక దుస్తులు చూపి విలపిస్తున్న భార్య సౌజన్య



భర్త అనిల్ పార్థివదేహానికి సెల్యూట్ చేస్తున్న సౌజన్య



రోదిస్తున్న అనిల్ తల్లిదండ్రులు, బంధువులు

పరిశ్రమ రద్దు చేసే వరకూ పోరు ఆగదు

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

వెల్గటూర్(ధర్మపురి): ఇథనాల్ పరిశ్రమను రద్దు చేసేవరకూ పోరు ఆగదని, తన ప్రాణం ఇచ్చి అయినా సరే నిర్మాణం ఆపి తీరుతానని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. మంత్రి కొప్పుల ఈశ్వర్ కాదు కదా.. వందమంది ఈశ్వర్‌లు వచ్చినా పరిశ్రమ నిర్మాణం జరగబోనివ్వనని ప్రతిజ్ఞ చేశారు. స్తంభంపల్లి శివారులో స్థాపించే ఇథనాల్ పరిశ్రమకు వ్యతిరేకంగా పాశిగామ, స్తంభంపల్లి, వెంకటాపూర్, వెల్గటూర్ గ్రామాల ప్రజలతో శనివారం డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో కలిసి ఆయన సమావేశమయ్యారు. నాలుగు గ్రామాల ప్రజలు తమ గోడును జీవన్‌రెడ్డితో చెప్పి కన్నీటి పర్యంతమయ్యారు. అనంతరం జీవన్‌రెడ్డి మాట్లాడుతూ, పరిశ్రమ నిర్మాణానికి సాగునీటి పారుదల, మైనింగ్ శాఖల అనుమతి లేకుండానే పరిశ్రమ ఏర్పాటు చేస్తున్నారన్నారు. పరిశ్రమ విడుదల చేసే వ్యర్థాలతో గోదావరి నదీ జలాలు, భూగర్భ జలాలు కలుషితమవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యాలయాలు, కళాశాలలు, పనికివచ్చే పరిశ్రమలన్నీ సిరిసిల్ల, సిద్దిపేట, గజ్వేల్‌లో ఏర్పాటు చేస్తున్నారని, ప్రజల ప్రాణాలుతీసే ఇథనాల్ పరిశ్రమను ఈ ప్రాంతంలో నిర్మాస్తారా? అని మంత్రి కేటీఆర్‌ను ప్రశ్నించారు. డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ప్రాణాలు తీసే ఫ్యాక్టరీని వ్యతిరేకిస్తున్న ప్రజలపై అక్రమ కేసులు నమోదు చేస్తూ బెదిరిస్తున్నారన్నారు. ప్రజలపై చిత్తశుద్ధి ఉంటే ఇథనాల్ ఫ్యాక్టరీ రద్దు చేయాలని మంత్రికి సూచించారు. గ్రామస్తులు, నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మెట్‌పల్లి మున్సిఫ్ కోర్టు మెజిస్ట్రేట్‌గా అరుణ్

మెట్‌పల్లి(కోరుట్ల): మెట్‌పల్లి మున్సిఫ్ కోర్టు మెజిస్ట్రేట్‌గా అరుణ్‌కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పుప్పాల లింబాద్రి, న్యాయవాదులు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అలాగే ఇన్‌చార్జి మెజిస్ట్రేట్‌గా బాధ్యతలు నిర్వర్తించిన వినీల్‌కుమార్‌ను సన్మానించారు.

చీఫ్ మినిస్టర్ కప్‌లో పాల్గొనాలి

జగిత్యాల: గ్రామీణ క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీసి మరింత ప్రోత్సహించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం చీఫ్ మినిస్టర్ కప్–2023ను ఈనెల 15 నుంచి 31 వరకు మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో వివిధ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తోందని జిల్లా యువజన క్రీడల అభివృద్ధి అధికారి బోనగిరి నరేశ్ తెలిపారు. జిల్లాలోని 20 మండలాల్లో ఈనెల 15 నుంచి 18 వరకు 15–36 ఏళ్ల వయస్సు గల యువతీ, యువకులకు అథ్లెటిక్స్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, ఫుట్‌బాల్ (కేవలం పురుషులు) పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మండలస్థాయిలో విజేతలకు జిల్లాస్థాయిలో ఈనెల 22 నుంచి 24 వరకు స్విమ్మింగ్, బాడ్మింటన్, బాక్సింగ్, బాస్కెట్ బాల్, వెయిట్‌లిఫ్టింగ్, అథ్లెటిక్స్, లాంగ్‌జంప్, షార్ట్‌పుట్ నిర్వహిస్తారని, జిల్లాస్థాయిలో గెలుపొందినవారిని ఈనెల 27 నుంచి 31 వరకు నిర్వహించే రాష్ట్రస్థాయి క్రీడలకు పంపించడం జరుగుతుందన్నారు.

దోషులకు శిక్ష పడేలా పనిచేయాలి


ఎస్పీ భాస్కర్

జగిత్యాలక్రైం: నేరాల్లో దోషులకు శిక్ష పడేలా పోలీసు అధికారులు, సిబ్బంది పనిచేయాలని ఎస్పీ భాస్కర్ సూచించారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో కోర్టు డ్యూటీ అధికారులతో శనివారం కోర్టు కేసుల ప్రగతిపై సమీక్షించారు. శిక్షల శాతం పెంచడం, తప్పు చేసినవారికి శిక్ష పడేలా చేయడం ద్వారా పోలీస్ శాఖపై ప్రజల్లో మరింత గౌరవం, నమ్మకం పెరుగుతుందన్నారు. పెండింగ్ కేసులు, వారెంట్లు, సమన్లు తదితర అంశాలపై సమీక్షించారు. సీఐలు శ్రీనివాస్, సరిలాల్, ఎస్సైలు రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.


వెబ్ పోర్టల్‌ను వినియోగించుకోవాలి


వెబ్ పోర్టల్‌ను ప్రారంభిస్తున్న ఆర్డీవో మాధురి

జగిత్యాల: పిల్లల నుంచి నిరాధారణకు గురైన వయోవృద్ధులు తమ సమస్యల సత్వర పరిష్కారం కోసం వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఫిర్యాదుల కోసం రూపొందించిన వెబ్ పోర్టల్‌ను వినియోగించుకోవాలని ఆర్డీవో మాధురి అన్నారు. శనివారం వయోవృద్ధుల సంక్షేమ శాఖ డైరెక్టర్ శైలజ ఆదేశాల మేరకు వెబ్‌పోర్టల్‌ను ప్రారంభించి మాట్లాడారు. నిరాధారణకు గురైన తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ, సంరక్షణ చూసుకోని పిల్లలపై ఆన్‌లైన్‌లో సీనియర్ సిటిజన్ మెయింటెనెన్స్ కేసెస్ మానిటరింగ్ సిస్టమ్ వెబ్ పోర్టల్‌లో http:// tsseniorcitizens. cgg. gov. in/ లో ఫిర్యాదు చేయవచ్చని, మీసేవ కేంద్రాల ద్వారా వీలుంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్, ఏవో రాజమనోహర్‌రెడ్డి, విశ్వనాథ్, తిరుపతయ్య పాల్గొన్నారు.

'పశ్చిమ డివిజన్'లో ప్రకంపనలు

- 15మంది సర్పంచులకు ఒకేసారి లేఖలు
- పద్ధతులు మార్చుకోవాలని హెచ్చరికలు
- అటవీభూములు, కబ్జాదారులపై ఆగ్రహం
- పోస్టు ద్వారా చేరిన హెచ్చరిక లేఖలు
- 15ఏళ్ల తర్వాత మళ్లీ మావోయిస్టు కలకలం


మావోయిస్టుల పేరుతో వచ్చిన లేఖ

సారంగాపూర్(జగిత్యాల): జిల్లాలోని బీర్‌పూర్ మండలం సుమారు 15ఏళ్లక్రితం వరకూ మావోయిస్టు (అప్పటి పీపుల్స్‌వార్)లకు పెట్టని కోటలా ఉండేది. కానీ, శుక్ర, శనివారాల్లో స్థానిక ప్రజాప్రతినిధులకు మావోయిస్టుల పేరిట లేఖలు రావడం జిల్లావ్యాప్తంగా కలకలం రేపింది. మావోయిస్టు పార్టీ అగ్రనేత ముప్పాల లక్ష్మణ్‌రావు ఉరఫ్ గణపతి స్వగ్రామం నిన్నటివరకూ ప్రశాంతంగా ఉంది. కానీ, నక్సల్స్ లేఖలతో ఒక్కసారిగా వాతావరణం వేడెక్కింది.

గోదావరి బెల్ట్ ఏరియా కమిటీ పేరిట లేఖలు..

- గోదావరి బెల్ట్ ఏరియా కమిటీ మావోయిస్టు కార్యదర్శి మల్లికార్జున్ పేరిట స్థానిక ప్రజాప్రతినిధులకు లేఖలు అందినట్లు తెలిసింది.
- సీపీఐ – మావోయిస్టు జగదల్‌పూర్ జిల్లా ఏరియా కమిటీ పేరిట లెటర్‌హెడ్‌లపై ఆ లేఖలు ఉన్నాయి.
- మరికొన్నింటిపై మల్యాల ఏరియా కమిటీ ఉంది.
- వీటిని సానుభూతిపరులు పంపించారా, గతంలో నక్సల్స్‌తో సంబంధాలు నెరిపిన వారు పోస్టు చేశారా? అనేదానిపై పోలీసులు విచారణ చేపట్టినట్లు తెలిసింది.

లేఖల్లో ఏముందంటే..

- అటవీభూములు కబ్జా చేసి, అక్రమంగా పట్టాలు చేశారని, ఈవిషయంలో రెవెన్యూ, అటవీ అధికారులు, ప్రజాప్రతినిధులు రూ.లక్షలు పంచుకున్నారని ఆరోపించారు. అడవుల్లో చెట్లు నరికినా, భూములు కబ్జా చేసినా, అందుకు ప్రోత్సహించినా బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.
- నర్సింహులపల్లె గ్రామంలో ఓ వ్యక్తి అక్రమంగా దుకాణం నిర్మించారని, తక్షణమే తొలగించాలని లేఖల్లో హెచ్చరించారు. కొందరు ప్రజాప్రతినిధులు పోలీస్‌స్టేషన్‌కి వెళ్లి పంచాయితీలు చేస్తున్నారని, అక్కడిదాకా వెళ్లకుండా చూడాలని సూచించారు. మరికొందరు వివాహేతర సంబంధాలు కొనసాగిస్తారని ప్రస్తావించారు.

పద్మక్క ఇచ్చిన రూ.15లక్షల కోసం వస్తాం..

- అప్పటి నక్సల్స్ నేత పద్మక్క మార్చి 2003లో ఓ వ్యక్తికి రూ. 15 లక్షలు ఇచ్చారని, ఇందులో రూ.1,000 నోట్లు, రూ.500 నోట్లు ఉన్నాయని లేఖలో తెలిపారు. కొద్దిరోజులకే నేరెళ్ల ఎన్‌కౌంటర్‌లో పద్మక్క మృతిచెందారని, ఆమె ఇచ్చిన సొమ్ము కోసం త్వరలో వస్తామని, సిద్ధంగా ఉండాలని లేఖలో ఉంది.
- అయితే, అత్యధిక మంది ప్రజాప్రతినిధులకు అందిన లేఖలో అటవీ భూముల్లో చెట్లు నరికివేతన, భూము కబ్జా, అక్రమ పట్టాల గురించి ప్రస్తావన ఉంది. వీరు తమ పద్ధతులు మార్చుకోకుంటే శిక్ష తప్పదని హెచ్చరించారు. ప్రజాప్రతినిధులతోపాటు నర్సింహులపల్లెలో సాధారణ వ్యక్తులకు కూడా హెచ్చరిక లేఖలు అందినట్లు తెలిసింది.

అనేక అనుమానాలు..

- మావోయిస్టుల పేరిట ప్రజాప్రతినిధులు, గ్రామస్తులకు అందిన లేఖలపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గడ్చిరోలిలో పోస్టు చేసినట్లు ఉన్నాయని కొందరు చెబుతుండగా, అక్కడి పార్టీ లెటర్‌హెడ్‌లపై రాసి పోస్టు చేశారని మరికొందరు పేర్కొంటున్నారు. అంతేకాదు.. అన్నిలేఖల్లోనూ ఓ వ్యక్తి దుకాణం కూల్చి వేయాలని హెచ్చరించడం కొందరు కావాలనే చేసిన పనిగా భావిస్తున్నారు. లేఖలు అందుకున్న కొందరు పోలీస్ ఉన్నతాధికారులను ఆశ్రయించగా, మరికొందరు స్థానిక పోలీస్‌స్టేషన్‌లోని అధికారులను కలిసి నట్లు తెలిసింది.

పీపుల్స్‌వార్ గత ప్రాబల్యం ఇదీ..

- ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అప్పటి (సీపీఐ – ఎంఎల్) పీపుల్స్‌వార్‌లో తూర్పు, పశ్చిమ డివిజన్ కమిటీలు ఉండేవి.
- తూర్పు డివిజన్‌లో పెద్దపల్లి, గోదావరిఖని – రామగుండం, కరీంనగర్, హుజూరాబాద్, హుస్నాబాద్, మంథని ప్రాంతాలు ఉండగా, పెద్దపల్లి దళం, మంథని దళం, హుస్నాబాద్ దళాలు వాటి పరిధిలో కార్యకలాపాలు నిర్వహించేవి.
- పశ్చిమ డివిజన్‌లో జగిత్యాల, మల్యాల, మానేరువాగు, సిరిసిల్ల, కామారెడ్డి, కమ్మర్‌పల్లి, మెట్‌పల్లి, కోరుట్ల ప్రాంతాలు ఉండేవి. ఇందులో మల్యాల, జగిత్యాల, మెట్‌పల్లి దళాలు పనిచేస్తూ ఉండేవి. వేములవాడ, సిరిసిల్ల ప్రాంతాల్లో జనశక్తి ప్రాబల్యం ఉండేది. మల్లన్నపేట ఎన్‌కౌంటర్ తర్వాత పీపుల్స్‌వార్ మల్యాల దళాన్ని ఎత్తివేసింది. మెట్‌పల్లి, జగిత్యాల దళాలను కలిపి ఒకే దళం లోకల్ గెరిల్లా స్క్వాడ్(ఎల్‌జీఎస్)గా ఏర్పాటు చేసింది. ఇప్పుడు పంపిన లేఖల్లో మల్యాల ఏరియా కమిటీ, గోదావరి ఏరియా బెల్ట్ కమిటీ పేరుతో ఉండడం, దానికిందే గోదావరి బెల్ట్ కార్యదర్శి మల్లికార్జున్ పేరు ఉండడం అనుమానాలకు తావిస్తోంది.

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి


నర్సయ్య (ఫైల్)

వేములవాడరూరల్: ఉపాధి పనులకు వెళ్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న యజమాని గుండె ఒక్కసారిగా ఆగి కుప్పకూలిపోయాడు. తోటి కార్మికులు వెంటనే స్పందించి ప్రాణాపాయం నుంచి తప్పించేందుకు ప్రయత్నాలు చేసినా ఫలితం లేకుండాపోయింది. ఈ విషాద ఘటన వేములవాడ రూరల్ మండలం ఫాజుల్‌నగర్ గ్రామంలో శనివారం జరిగింది. గ్రామస్తులు, తోటి కార్మికుల వివరాలు.. ఫాజుల్‌నగర్‌కు చెందిన గంగిపల్లి నర్సయ్య (57) ఉపాధిహామీ పనులు చేస్తుంటాడు. ఎప్పటిలాగే శనివారం తోటి కార్మికులతో పనికి వెళ్లాడు. పని చేస్తుండగానే అకస్మాత్తుగా గుండెలో నొప్పి వచ్చింది. గమనించిన తోటి కార్మికులు నర్సయ్యను కాపాడేందుకు ఎంత ప్రయత్నించినా ప్రాణాలు దక్కలేదు. మాట్లాడుతూ అక్కడికక్కడే మృతిచెందాడు. ఎంపీడీవో రాంరెడ్డి, ఏపీవో మల్లయ్య ఘటనా స్థలానికి వెళ్లి కారణాలు తెలుసుకున్నారు. ఇంటి యజమాని మృతితో భార్య లీలవ్వ, కొడుకు, కోడలు కన్నీటి పర్యంతమయ్యారు. పేద కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సర్పంచ్ వేణు, తోటి కార్మికులు కోరారు.

ఏడాదిలో ఇద్దరు..

పది నెలల క్రితం వట్టెంల గ్రామానికి చెందిన గొల్లపల్లి గంగనర్సవ్వ ఉపాధి పనులకు వెళ్లి ఇంటికి రాగానే గుండెనొప్పితో ఒక్కసారిగా కుప్పకూలి మృతిచెందింది. శనివారం ఫాజుల్‌నగర్‌కు గంగిపెల్లి నర్సయ్య పని చేస్తుండగానే గుండెనొప్పితో మృతిచెందాడు. ఏడాది కాలంలోనే ఇద్దరు కూలీలు గుండెనొప్పితో మృతి చెందడం తోటి కార్మికులను కలచివేస్తోంది. కాగా గతంలో చనిపోయిన నర్సవ్వకు ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందలేదు. ఉపాధి పనుల వద్ద అత్యవసర హెల్త్‌కిట్‌లు, వాటర్ సౌకర్యం ఉండాలని అధికారులు చెబుతున్నా.. ఏర్పాటు చేయడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

బుగ్గారం(ధర్మపురి): అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని జన సమితి జిల్లా అధ్యక్షుడు చుక్క గంగారెడ్డి డిమాండ్ చేశారు. పంటలు కోల్పోయి నష్టాలబారిన పడిన రైతాంగం సమస్యలపై శనివారం కలెక్టర్ యాస్మిన్‌బాషాకు వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా గంగారెడ్డి మాట్లాడుతూ, అకాల వర్షాలతో పంట నష్టం జరిగిన రైతులకు ఎకరానికి రూ.50 వేల పరిహారం చెల్లించాలని డిమాండు చేశారు. తడిసిన వరి ధాన్యాన్ని షరతులు లేకుండా కొనాలని, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి చింతకుంట్ల శంకర్, మాజీ ఎంపీటీసీ రాజరెడ్డి, మెట్‌పెల్లి కన్వీనర్ శ్రీనివాస్, కంతి రమేష్ తదితరులున్నారు.

ఆర్టీసీ అద్దె బస్సుపై రాయితో దాడి



రాయి దాడితో పగిలిన బస్సు అద్దాలు

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని మంచినీళ్ల బావి సమీపంలో శుక్రవారం రాత్రి ఆర్టీసీ అద్దె బస్సుపై ఇద్దరు యువకులు రాయి విసరడంతో బస్సు అద్దం పగిలి ఓ ప్రయాణికుడికి గాయాలయ్యాయి. హుజూరాబాద్ డిపోకు చెందిన బస్సు నిజామాబాద్ నుంచి వరంగల్‌కు వెళ్తుండగా ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై వెంబడించి మంచినీళ్ల బావి వద్ద బస్సును ఆపి డ్రైవర్‌తో వాగ్వాదానికి దిగారు. ఇంతలోనే యువకులు రాయితో దాడిచేయడంతో బస్సు అద్దాలు పగిలి ప్రయాణికుడి తలకు గాయాలయ్యాయి. వెంటనే డ్రైవర్ కొండాల్‌రెడ్డి, కండక్టర్ రవీందర్ పట్టణ పోలీసులకు సమాచారం అందించగా ఎస్సై సందీప్ సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. దాడి చేసి పారిపోయిన యువకులను స్థానికులు వీడియో తీశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని యువకులను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు.

'ఎమ్మెల్యేకు భయపడితే ఎప్పటికీ ఎదగలేరు'


శిబిరంలో మాట్లాడుతున్న లక్ష్మీనర్సింహారావు

మేడిపెల్లి(వేములవాడ): ఎమ్మెల్యేకు భయపడితే ఎప్పటికీ ఎదగలేరని చల్మెడ ఆనందరావు ఆస్పత్రి చైర్మన్ చల్మెడ లక్ష్మీనర్సింహారావు అన్నారు. శనివారం బీమారం మండలం వెంకట్రావుపేట్‌లో చల్మెడ ఆస్పత్రి కరీంనగర్, జిర్క్స్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీనర్సింహారావు వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబుపై పరోక్షంగా ఘాటైన వ్యాఖ్యలు చేశారు. స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు చేసేవారిని ప్రజలు ఎప్పటికీ ఆదరిస్తారని, ఎమ్మెల్యే ఏమైనా అనుకుంటారని సేవా కార్యక్రమాలకు దూరంగా ఉంటే నాయకుడిగా ఎదగలేరని పేర్కొన్నారు. ఈ మేరకు నిర్వహించిన శిబిరంలో సుమారు 350 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కాటుపల్లి జగన్‌రెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, ఆనంద్, వైద్యులు పాల్గొన్నారు.

ప్రతీ గింజను కొనుగోలు చేయాలి


కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, అదనపు కలెక్టర్లు

జగిత్యాల: చివరి గింజ వరకు ధాన్యం మద్దతు ధరకు కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. శనివారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ధాన్యం కొనుగోలు కేంద్రాలను పూర్తిస్థాయిలో ప్రారంభించి రైతుల నుంచి చివరి గింజ వరకు మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయాలని ఆదేశించారు. సీఎం కేసీఆర్ నిర్ణయం మేరకు తడిసిన ధాన్యాన్ని సైతం మద్దతు ధరకు కొనాలన్నారు. గన్నీ బ్యాగులు, మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని, పెండింగ్‌లో ఉన్న సీఎంఆర్ వెంటనే డెలివరీ చేయాలన్నారు. కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ యాస్మిన్ బాషా, అదనపు కలెక్టర్లు మకరంద్, లత పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


అయిలయ్య మృతదేహం

జగిత్యాలక్రైం: జగిత్యాల అర్బన్ మండలం తిప్పన్నపేట గ్రామ శివారులో జగిత్యాల–ధర్మపురి జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో వొల్లెపు అయిలయ్య (60) అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసుల వివరాలు.. జనగామ జిల్లా పాలకుర్తి మండలం తొర్రూర్ గ్రామానికి చెందిన వొల్లెపు అయిలయ్య 12 సంవత్సరాలుగా ఒడ్డెరపని చేసుకుంటూ విద్యానగర్‌లో నివాసం ఉంటున్నాడు. శనివారం సాయంత్రం పనికి వెళ్లి ద్విచక్రవాహనంపై వస్తుండగా తిప్పన్నపేట శివారులో ఎదురుగా వస్తున్న వాహనం ఢీకొట్టింది. రూరల్ ఎస్సై అనిల్ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య ఇద్దమ్మ, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఒకరి మృతికి కారకుడైన వ్యక్తి అరెస్ట్

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని విజయపురి కాలనీకి చెందిన సయ్యద్ నయీం మృతికి కారకుడైన హైదర్ అలియాస్ హైమద్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ సీఐ రాంచందర్‌రావు తెలిపారు. విజయపురి కాలనీకి చెందిన తాజ్ అతని సోదరుడు రాయిక్‌లకు చెందిన హైదర్ అలియాస్ హైమద్ మధ్య శుక్రవారం మధ్యాహ్నం గొడవ జరుగుతుండగా అడ్డుకోబోయిన సయ్యద్ నయీంను హైదర్ నెట్టివేయడంతో తలకు బలమైన గాయాలై మృతిచెందాడు. మృతుడి భార్య షబానా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు శనివారం హైమద్‌ను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు.

విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు

జగిత్యాల: విదేశాల్లో ఉద్యోగం చేయాలనుకునే అభ్యర్థులు టామ్‌కామ్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సత్తమ్మ తెలిపారు. ప్రస్తుతం జర్మనీలో సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, సిస్టమ్ అడ్మినిస్ట్రేషన్, నెట్‌వర్క్ అడ్మినిస్ట్రేషన్, ప్రాజెక్ట్ మేనేజర్, కన్సల్టెంట్ ఐటీ సపోర్ట్ జాబ్ రోల్స్ కోసం రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు టామ్‌కామ్ వెబ్‌సైట్, లేదా మొబైల్ యాప్‌లో నమోదు చేసుకోవాలని, దరఖాస్తులను మెయిల్ చేయాలన్నారు. వివరాలకు 98496 39539 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

మాదకద్రవ్యాల నిర్మూలనకు కృషి చేయాలి

- రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యుడు అరికెల దేవయ్య



మాట్లాడుతున్న దేవయ్య, పక్కన ఎస్పీ భాస్కర్

జగిత్యాల: డ్రగ్స్, మాదకద్రవ్యాల నిర్మూలనకు అందరూ కృషి చేయాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యుడు అరికెల దేవయ్య అన్నారు. శనివారం మహిళ అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, పోలీసు శాఖ సమన్వయంతో మత్తు పదార్థాల నిర్మూలన, పిల్లల రక్షణ అనే అంశంపై శిక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో గంజాయి, మత్తు పదార్థాల నిర్మూలనకు పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుత ఆధునిక కాలంలో టెక్నాలజీ పెరుగుదలతో పాటు, పిల్లలు ఎక్కువ శాతం మత్తు పదార్థాలకు బానిసలవుతున్నారని, వారి బంగారు భవిష్యత్ నాశనమవుతుందన్నారు. పిల్లల హక్కులను కాపాడాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని, ఎవరైనా పిల్లలకు బలవంతంగా అలవాటు చేసినా, దుకాణదారులు అమ్మినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. మత్తు పదార్థాలు తీసుకున్న వారిని ఎలా గుర్తించాలి, ఎలా అరికట్టాలన్న దానిపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఎస్పీ భాస్కర్ మాట్లాడుతూ, మత్తు పదార్థాలకు పిల్లలు బానిసలు కావద్దని, మంచి చదువులు చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. విద్యార్థులు డ్రగ్స్, మత్తు పానియాలకు అలవాటు పడకుండా ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో అవగాహన కల్పిస్తున్నామన్నారు. మత్తు పదార్థాలు అమ్ముతున్నట్లు, రవాణా చేస్తున్నట్లు సమాచారం ఉంటే పోలీస్‌స్టేషన్‌కు లేదా 100కు డయల్ చేయాలని, వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి నరేశ్, బాలల పరిరక్షణాధికారి హరీశ్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ ధనలక్ష్మి, ప్రొటెక్షన్ అధికారులు కందుకూరి కరుణశ్రీ, సురేశ్, ఎస్పీ డీఎస్పీ రవీందర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బిల్లులు ఇవ్వకుంటే ఆత్మహత్యే శరణ్యం


ఇన్‌చార్జి ఎంపీపీ దూషించాడని కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న సర్పంచులు

- మండల సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరించిన సర్పంచులు
- ఇన్‌చార్జి ఎంపీపీ, సర్పంచుల మధ్య వాగ్వాదం

జగిత్యాలరూరల్: గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న బిల్లులు ప్రభుత్వం విడుదల చేయకుంటే తమకు ఆత్మహత్యే శరణ్యమని జగిత్యాల రూరల్ మండలానికి చెందిన సర్పంచులు శనివారం వాపోయారు. మండల సర్వసభ్య సమావేశానికి సర్పంచులు పెట్రోల్ డబ్బాలతో రావడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. సర్వసభ్య సమావేశం ఉదయం 11 గంటలకు ఉండగా ఎంపీటీసీలు ఎవరూ హాజరు కాకపోవడంతో గంటపాటు వాయిదా వేశారు. ఈ నేపథ్యంలోనే రూరల్ మండలానికి చెందిన ప్రజాప్రతినిధులు సమావేశానికి వచ్చి తమకు సమాచారం అందించడం లేదని సింగిల్ విండో చైర్మన్లు పత్తిరెడ్డి మహిపాల్‌రెడ్డి, సందీప్‌రావు అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఇదే క్రమంలో సర్పంచులు పెట్రోల్ డబ్బాలతో సమావేశ మందిరంలోకి వచ్చి తమకు ప్రభుత్వం పెండింగ్ బిల్లులు మంజూరు చేయకుంటే ఆత్మహత్య చేసుకుంటామని ఆందోళన చేపట్టారు. దీంతో సభలో ఉద్రిక్తత పరిస్థితి చోటుచేసుకుంది. ఈ నేపథ్యంలోనే జరిగిన వాగ్వాదంలో ఇన్‌చార్జి ఎంపీపీ తమను దూషించాడని సర్పంచులు కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. ఇన్‌చార్జి ఎంపీపీ క్షమాపణ కోరడంతో శాంతించారు.

బీసీ ఎంపీపీని ఎన్నుకోవాలని వినతి


జగిత్యాల రూరల్ ఎంపీపీ బీసీ జనరల్ ఉండగా, ఎంపీపీ మృతితో రెండేళ్ల క్రితం ఉపాధ్యక్షుడిగా ఉన్న జనరల్ వ్యక్తికి ఇన్‌చార్జి ఎంపీపీ బాధ్యతలు అప్పగించారు. కాగా ఇప్పటి వరకు బీసీ అభ్యర్థిని ఎంపీపీగా ఎన్నుకోవడం లేదని, వెంటనే ఎన్నుకోవాలని కాంగ్రెస్ ఎంపీటీసీలతో పాటు అధికార పార్టీకి చెందిన ఎంపీటీసీలు ఎంపీడీవోకు వినతిపత్రం సమర్పించారు. వచ్చే మండల సమావేశం వరకు ఎంపీపీ ఎన్నిక జరిగితేనే తాము సమావేశానికి హాజరవుతామని తేల్చి చెప్పారు.


సమావేశం వాయిదా

మండల సర్వసభ్య సమావేశం ఉదయం 11 గంటలకు ఉండగా, ఇన్‌చార్జి ఎంపీపీ తమను పట్టించుకోవడం లేదని, ఎలాంటి నిధులు కేటాయించడం లేదని ఎంపీటీసీలు సమావేశానికి హాజరు కాలేదు. దీంతో మండల సర్వసభ్య సమావేశం వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో రాజేశ్వరి ప్రకటించారు.

కొనుగోలు కేంద్రాల్లో నిలువు దోపిడీ

- నిర్వాహకుల తీరుపై నిరసన
- చిట్టాపూర్‌లో రోడ్డెక్కిన రైతులు
- పురుగుల మందు డబ్బాలతో మహిళా రైతుల ఆందోళన


రహదారిపై ధర్నా చేస్తున్న రైతులు


మందు డబ్బాలతో నిరసన తెలుపుతున్న మహిళా రైతులు

మల్లాపూర్(కోరుట్ల): ధాన్యం సేకరణలో నిర్వాహకులు నిలువు దోపిడీ చేస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు. చిట్టాపూర్ రహదారిపై శనివారం బైఠాయించి నిరసన తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లోని సమస్యలు పరిష్కరించాలని మందు డబ్బాలతో ధర్నా చేశారు. నాణ్యత ప్రమాణాలు లేవని నెలల తరబడి ధాన్యం తూకం వేయకుండా వేధిస్తున్నారని ఆరోపించారు. మిల్లర్లు ఇష్టరాజ్యంగా వ్యవహరిస్తూ తాలుతప్ప, తరుగు, నాణ్యతలేమి అంటూ ఒక్కో క్వింటాలుపై 5 కిలోల వరకు కోత విధిస్తున్నారని ధ్వజమెత్తారు. ఒక్కో క్వింటాలుకు రూ.100– రూ.150 వరకు నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. లారీల కొరతతో రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం కుప్పల పడిగాపులు కాయాల్సి వస్తోందని ఆవేదన చెందారు. నిర్వాహకులు, మిల్లర్ల నిలువుదోపిడీ నుంచి తమను కాపాడాలని వారు డిమాండ్ చేశారు. పీసీసీ డెలిగేట్ సభ్యుడు జువ్వాడి నర్సింగరావు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు సాంబారి ప్రభాకర్ వారికి సంఘీభావం ప్రకటించారు. తహసీల్దార్ రవీందర్ రైతులతో మాట్లాడి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు.